# విముక్తుడు

జొన్నలగడ్డ రామలక్ష్మి

మనిషికి అసాధ్యమైనవి ఏమీ లేదం టారు కానీ ఫలితముండదని నమ్మకంగా తెలి సినా అసాధ్యాల వెంటబడేవారు కొందరుంటారు. సాధ్యాసాధ్యాలను తమ ఆశయాలకు అనుగుణంగా నిర్ణయించుకునే స్వేచ్ఛ వారికి లేకపోవడం చిత్రమైన విధి నడకల్లో ఒకటనిపిస్తుంది - నరసింహారావు, సుదర్శన్‌లను తలచినప్పుడల్లా!

ఆరోజు పొద్దుటే నేను పేపరు చదువుతుండగా, "నరసింహారావుగారి భార్య సావిత్రిగారు పోయారుట. పక్కింటి రత్నంగారు చెప్పారు," అంది నా భార్య కాఫీ అందిస్తూ.

"అలాగా! ఎప్పుడుటా?" అన్నాను పేపర్లోంచి మొహం తిప్పకుండా కాఫీకప్పు కోసం చేయి సాచి.

"రాత్రి పదకొండుగంటల ప్రాంతాల ప్రాణం పోతే మరో అరగంటకి వీళ్ళకి ఫోనుచేసి చెప్పారుట. అప్పటికే మనం లైట్లార్పేసి పడుకున్నాం కదా! అందుకని వాళ్ళిక మనల్ని లేపకుండా రాత్రికి రాత్రి చూడ్డానికి వెళ్ళి తెల్లారకట్టే తిరిగొచ్చారు. ఇప్పుడు మళ్ళీ వెడతారుట. పదయ్యేసరికి బాడీ తీసుకెళ్ళిపోతారుట మరి," అని ఆగి నా రియాక్షన్ కోసం చూసిందామె.

నేను "ఆహా, ఊహు," అంటున్నాను పేపర్లోంచి తల తీయకుండానే.

మామూలుగా పేపర్ని అంతగా పట్టించుకోని నేను ఈమధ్య రోజా పేపరు చూస్తున్నాను, ఐఐటి ఎంట్రెన్సు పరీక్షా ఫలితాల కోసం.

ఇంతకీ పరీక్ష రాసింది మా పిల్లలు కాదు. ఓసారి ఐఐటి ఎంట్రెన్సులో తప్పి రెండో ప్రయత్నం కోసం ఏడాది చదువును త్యాగం చేసి మా పెద్దబ్బాయి రఘుకి క్లాసుమేటుగా మారిపోయిన సుదర్శన్ గురించే నా ఆతృత. వాడు నా స్నేహితుడు వెంకట్రావు కొడుకు.

చదువు విషయంలో నా అభిప్రాయాలు సమకాలీకులతో కలవ్వు. బ్రతుకు కోసం చదువు తప్పితే చదువు కోసం బ్రతుకు కాదని నమ్మే నా థియరీ మంచిదేనన డానికి చాలా నిదర్శనాలున్నాయి. చిన్నప్పట్నించీ బ్రిలియంటు అనిపించుకున్న నేను మంచి గవర్నమెంటు ఉద్యోగం సంపాదించి పెద్ద హోదాలో జీవిస్తున్నాను. ఐతే మొద్దులనిపించుకున్న నా హైస్కూలు క్లాసుమేట్సులో చాలామంది వివిధ రంగాల్లో రాణించి నాకంటే మెరుగైన ఆర్థిక ప్రగతిని సాధించారు. ఇప్పుడు ఐఐటిలకు ఎగబడు తున్న వారిలో ఎక్కువ శాతం ఆర్థికప్రగతి కోసమే. అందుకు వారు చెల్లిస్తున్న మూల్యం బాల్యం. మా పిల్లల విషయంలో అలా జరక్కుండా జాగ్రత్తపడ్డాను. అందువల్ల వాళ్ళకు ఆటలు, సంగీతం, నాట్యం వగైరా హాబీలకు తగిన తీరుబడి ఉండేది. కానీ అందుకు వెంకట్రావు నన్ను తప్పుపడుతూ, 'ఇది పోటీ యుగం. దీనికి ఎదురీదు తున్నావు. పెద్దయ్యాక నీ పిల్లలు నిన్ను తప్పు పడతారు,' అని హెచ్చరించే వాడు. వాడి పుత్రరత్నం సుదర్శన్ నిజంగా రత్నమే. తండ్రి ఆశయం బలవంతంగా తన మీద రుద్దబడడం వల్ల పుడుతూనే వాడి జీవితం ఐఐటి సీటుకు అంకితమైపోయింది. చదువు, చదువు, చదువు... అదే వాడి జీవితం. అందువల్ల వాడు మొదట్లో కొంతకాలం ఇబ్బందికి గురైనా క్రమంగా అలవాటుపడ్డాడు. నాకు వాడంటే ఏమూలో విపరీతమైన జాలి. ఈసారి కూడా వాడి శ్రమకు ఫలితం దక్కకపోతే వాడు మావాడిలాగే ఎంసెట్ ఫలితాల మీద ఆధారపడాలి. అదే జరిగితే వాడి సంగతేమో కానీ నేనే తట్టుకోలేననిపించి, రోజా పేపరు చూస్తున్నాను, సుదర్శన్ నాకంటే ముందుగా ఇంటర్నెట్లో ఫలితాలు చూస్తాడని తెలిసినా.

ఏ కారణం చేతనైతేనేం పేపరు తీస్తే చాలు అది నన్ను డిటెక్టివ్ నవల్లా ఆకర్షిస్తుంది. అందుకని భార్య తెలిసినవారి మరణవార్త చెప్పినా అదింకా నా హృదయాన్ని తాకలేదు. కాబట్టి ఆహా, ఊహూలే తప్ప నాలో స్పందన లేదు

ఆ విషయం గ్రహించిందేమో, "ఒకసారి మనిద్దరం వెళ్ళొద్దాం పదండి," అనేసి నేను బదులిచ్చేలోగానే, "ఈరోజెలాగూ ఆదివారమే. ఆఫీసు గొడవలేదు. బాడీ వెళ్ళేదాకా ఉండి వచ్చేద్దాం. తొందరగా బట్టలు మార్చుకోండి. ఈలోగా నేను పిల్లలకు చెప్పివస్తాను," అంటూ నిర్ణయం కూడా తీసేసుకుని లోపలకు వెళ్ళింది నా భార్య.

పబ్లిక్ రిలేషన్స్‌లో ఆడవాళ్ళు తమకు తెలియకుండానే నిస్వార్థంగా పోషించే పాత్రకు తగిన గుర్తింపు ఉండదు. నిజానికి నేను ఇలాంటి విషయాల్లో అట్టే చొరవ చూపించను. ఐనా నా భార్య కారణంగా బంధు మిత్ర వర్గంలో, ప్రత్యేకించి ఇలాంటి విషయాల్లో చాలా ప్రాంప్ట్ అని నాకు మంచి పేరుంది. పాపం ఆ పేరులో నా భార్యకు ఏమాత్రమూ వాటా లేదు.

నేను పేపరు మూసాను. అప్పటికి నరసింహారావు భార్య సావిత్రి పోయిందన్న వార్త నా హృదయాన్ని తాకింది. ఐనా నాకు బాధనిపించలేదు. ఇంకా చెప్పాలంటే అది సంతోషించాల్సిన విషయంగా భావించే అనేక మందిలో నేనూ ఒకణ్ణి. ఆమె గత నాలుగు సంవత్సరాలుగా కాన్సరుతో నేడే రేపో అన్నట్లు బ్రతుకీడు స్తుంది.

సావిత్రికి ఇద్దరు పిల్లలు. కూతురికి పెళ్ళైపోయింది. కొడుక్కి చదువైపోయి ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరూ విదేశాల్లోనే ఉంటున్నారు. రెండేళ్ళ క్రితందాకా వాళ్ళు మా పక్కింట్లోనే ఉండేవారు. అప్పటికే కాన్సరుతో ఆమె అను భవిస్తున్న నరకం మాకు హృదయవిదాకరంగా తోచేది. ఆమె కోసం ఆయన పడే కష్టనష్టాలు సామాన్యులకు అనూ హ్యం. ఐనా ఆ దంపతుల్లో ఏదో ఆకర్షణ ఉండేది. వారిని చూసి ఇతరులు చలించాలి తప్ప వారెప్పుడూ భావి జీవితం గురించి బంగారు కలలు కంటున్నట్లే అనిపించేది. అదీ ఇరుగుపొరుగులతో అంటీముట్టనట్లుండే నాక్కూడా.

రిటైర్మెంట్ మూడేళ్ళు ఉన్నదనగా నరసింహారావుకు మొదటి డైలమా వచ్చింది. భార్య అనారోగ్యం వల్ల ఊరు కదలడం లేదు కానీ ఆయనకు విదేశాల్లో మంచి ఉద్యోగాలకు ఆఫర్లున్నాయి. ఆమె జీవితం నేడే రేపో అన్నది చేదు నిజం. అలాంటప్పుడు సావిత్రి ఆ ఊళ్ళో స్వంతిల్లు కావాలనేది. అదీ తమ స్థోమతుకు తగినట్లుగా చాలా పెద్దదిగా ఉండా లనేది. ఉంటుందో ఉండదో తెలియని ఆమె కోసం తానుంటాడో ఉండడో తెలియకుండా ఇంటిమీద ఎక్కువ మొత్తం పెట్టుబడి పెట్టడానికి సంకోచి స్తున్నాడాయన.

"చివరి బంతి ఆడేవరకూ ఒకరోజు క్రికెట్ ఫలితం చెప్పలేము. నా జీవితమూ అంతే," అంటూండే సావిత్రి కోరికలో దూరదృష్టి ఉన్నదని తెలుసుకుందుకాయనకు ఎంతోకాలం పట్టలేదు.

ఉన్నట్లుండి ఇంటివాళ్ళు కుంటిసాకులు చెప్పి ఇల్లు ఖాళీ చేయ మన్నారు వాళ్ళని.

"ఇలా జరుగుతుందని నాకు ముందే తెలుసు. అందుకే మనదంటూ స్వంతిల్లు ఉండాలి. మీరేమో మనమిద్దరమే అనుకుంటారు కానీ మనకు రెండువైపులా బోలెడు బలగం వస్తూ పోతుండే జనాన్ని తట్టుకుందుకు కాస్త పెద్దిల్లే కావాలి," అంది సావిత్రి ఆయనతో.

ఆ సమయంలో రుక్మిణి వాళ్ళను ఆదుకొంది. రుక్మిణ నరసింహా రావు చెల్లెలు. ఆమెకా ఊళ్ళో చాలా పెద్దిల్లుంది. రుక్మిణి, భర్త ఢిల్లీలో ఉన్న కొడుకు దగ్గరకు వెళ్ళిపోతూ ఆ ఇంటి బాధ్యతను నరసింహారావుకు అప్పజెప్పారు. "ఆఫీసు మీకిచ్చే అలవెన్సు మాకు అద్దెగా ఇచ్చుకుంటే ఉత్తినే ఉంటున్నామన్న సంకోచం మీకుండదు. ఇల్లు అయినవాళ్ళ చేతిలో ఉంటే మాకు సంతోషం. వదినకు స్వంతిల్లు మనసూ తీరుతుంది. ఒకవేళ మా ఇల్లు పరాయిదని వదిన అనుకుంటే అప్పుడే అది తన పేరున రిజిస్ట్రేషన్ చేయించి వెళ్ళిపోతాం. ఆ తర్వాత మీరు వీలు చూసుకుని మరో ఇల్లు కట్టించి మాకు ఇవ్వండి. లేదూ మా ఇల్లు మాకిచ్చేసి మీ ఇంట్లోకి మీరు మారిపోనూవచ్చు. ఆలోచించుకుందుకు మీకు బోలెడు టైము," అంది రుక్మిణి వాళ్ళతో.

రుక్మిణి భర్త ఉద్యోగమేమిటో నాకు తెలియదు కానీ బయటెక్కడా ఆయన నోరు విప్పిన దాఖలాలు లేవు. ఆయన పేరు మీద జరిగే వ్యవహా రాలన్నీ రుక్మిణి నోటి మీదుగానే జరుగుతాయి. మాబోటివారికీ ఆమె నోటి మీదుగానే తెలుస్తాయి. ఇప్పుడూ అదే జరిగింది.

నరసింహారావు దంపతులు మా పక్కింటి నుంచి మాకు రెండు వీధుల దూరంలో ఉన్న రుక్మిణి ఇంటికి మారిపోయారు. ఆ తర్వాత ఈ రెండేళ్ళలోనూ వాళ్లింటికి మేము రెండుమూడు సార్లు వెళ్ళామేమో. అప్పుడైనా మీరు బాగున్నారా అంటే మీరు బాగున్నారా అని ప్రశ్నలు. మేము బాగున్నామంటే మేము బాగున్నామని జవాబులు. మరి మా పక్కింటి రత్న, ఆమె భర్త రంగారావు వారానికి రెండుసార్లయినా వాళ్ళింటికి వెళ్ళొస్తుంటారు. వన్‌డే క్రికెట్లో ద్రవిడ్‌కి దొరకని పరుగులు సెహ్వాగ్‌కి దొరికినట్లు వీళ్ళు సేకరించే సమాచారం అంతా ఇంతా కాదు.

మా పక్కింటి రత్న మహా చొరవైన మనిషి. ఎంత చొరవంటే ఆమె మా ఇరుగుపొరుగుల సమాచారాన్ని సేకరించి ప్రసారంచేసే విధానానికి నా భార్య సంతోషించదు, అసూయ పడుతుంది. ఆ అసూయకు కారణం రత్నకు అన్నివిధాలా సహకరించే భర్త ఉండడం కాకపోతే అది నా గుర్తింపును పొందేది కాదు.

ఏదేమైతేనేం రత్న, రంగారావుల ద్వారానే మేము సావిత్రి దంపతుల విశేషాలు తెలుసుకోగలిగే వాళ్ళం. ఇప్పుడు సావిత్రి మరణవార్తా వారి నుంచే మమ్మల్ని చేరింది.

ఆలోచిస్తూనే బట్టలు మార్చుకున్నాను. అంతలో నా భార్య పిల్లలకు అప్పగింతలు పూర్తిచేసుకుని వచ్చింది. వెళ్ళే చోటును బట్టి వేషధారణ ఉండాలి కాబట్టి ఆమె చాలా తొందరగా తయారై వచ్చింది.

ఏడడుగుల బంధం శాశ్వతమంటారు. పూర్వం దంపతులు పెళ్ళిలో ఏడడుగులే నడిచినా ఆ తర్వాత కలిసి ఎన్నో అడుగులు నడిచేవారట. మరిప్పుడు స్కూటర్లు వచ్చేక పక్కింటికి కూడా వాహనయోగం తప్పనిసరి అవుతున్న ఈ రోజుల్లో దంపతులది శాశ్వతంగా ఏడడుగుల బంధ మౌతోంది. ఈరోజు మాత్రం మేము మా దాంపత్యబంధానికి మరికొన్ని అడుగులు జతపర్చాల్సి ఉన్నదేమో నా భార్య నడిచే వెడదామంది.

ఇద్దరం కలిసి నడుస్తున్నాం, "పాపం ఆమె చాలా బాధపడ్డదండీ. కానీ కాన్సరు థర్డుస్టేజి తర్వాత కూడా నాలుగైదేళ్ళు బ్రతకడం చాలా పెద్ద విశేషం కదండీ!" అంది నా భార్య.

"అవును. కానీ ఆమె అలా నాలుగైదేళ్ళు బ్రతికిందంటే కారణం నరసింహారావే. సావిత్రి పేరు ఆమెక్కాదు. ఆయనకు పెట్టాలి. సావిత్రి యముడితో ఓరోజు పోరాడితే ఆమె కాన్సరుతో ఆయన నాలుగేళ్ళు పోరాడారు," అన్నాను.

నరసింహారావు చేసిన పోరాటం అసామాన్యం. ఆయన ఎందరో డాక్టర్లను సంప్రదించాడు. ఎన్నో ఊళ్ళు తిరిగాడు. డబ్బు మంచినీళ్ళలా ఖర్చుపెట్టాడు. శారీరక శ్రమనూ, మానసిక ఒత్తిడినీ ఆర్థికవ్యయాన్నీ ఓర్చుకుంటూ, తట్టుకుంటూ భరిస్తుండే ఆయన ముఖంలో చిరునవ్వు మాత్రం ఎప్పుడూ చెదరలేదు.

"అవునండీ! ఎంత కష్టపడ్డా ఆయన ఆమెను నరక బాధ నుంచి తప్పించాడనుకోను. ఐనా అలాంటి భర్త లభించడం వల్ల ఆమె అదృష్ట వంతురాలే అనిపిస్తుంది నాకు," అంది నా భార్య.

స్త్రీవాదులన్నారనుకోవడం కాదు కానీ నరసింహా రావులాంటి భర్త మన దేశంలో చాలామంది ఆడవాళ్ళకు గగనకుసుమం. నా భార్య మాటల్లో ఇప్పుడు నేనది గుర్తించినా రియాక్టవడానికి సమయం కాదని, "నువ్వాయన ప్రేమ గురించి చెబు తున్నావు. కానీ నేనాలోచిస్తున్నది వేరు. సావిత్రి యముడితో పోరాడి సత్య వంతుణ్ణి దక్కించుకుంది. కానీ నరసింహారావు తన పోరాటంలో ఓడి పోయిన రోజిది. ఈ రోజాయాన మనోభావాలెలా ఉంటాయంటావు?" అన్నాను మాట మార్చడానికి.

దశాబ్దాల దాంపత్యజీవితం. అపురూపమైన ప్రేమ. ఆమె లేక తను జీవించలేడనే కదా ఆయన సర్వశక్తులూ ధారపోసి ఆమెను రక్షించుకునే ప్రయత్నం చేశాడు. ఇప్పుడామె లేదు. ఏమౌతాడాయన?

నా భార్యకు సమాధానం స్ఫురించినట్లే ఉంది. దాని ప్రభావం ఆమె గొంతు మీద పడినట్లే ఉంది. "ఆయన్ను తల్చుకుంటే కడుపు తరుక్కు పోతోందండీ," అన్న ఆమె మాటలు అతి కష్టంమీద గొంతు పెగుల్చుకుని వచ్చినట్లు గుర్తించి ఆమెవైపు చూస్తే ఆ కళ్ళలో నీళ్ళు.

"ఛా! ఏమిటిదీ?" అన్నాను.

ఆమె పైటకొంగుతో కన్నీళ్ళొత్తుకుని, "బాడీ చూద్దామని వెడు తున్నాం. కానీ ఆయన్నెలాగండీ చూడ్డం?" అంది ఏడుపు గొంతుతో.

"అదీ నిజమే! ఇప్పుడు మనం నరసింహారావును చూసి ఉద్ధరించే దేమీ లేదు. పోనీ వెంకట్రావు ఇంటికి వెళ్ళొద్దామా. ఈవేళ సుదర్శన్ రిజల్ట్ రావాలని గుర్తు. వాడు మహా టెన్షన్లో ఉన్నాడు," అన్నాను.

"అయ్యో మీకు చెప్పనే లేదుకదూ! మీరు బాత్రూంలో ఉన్నప్పు డాయన ఫోను చేశారు. సుదర్శన్‌కు ఐఐటిలో రాలేదుట. మనవాడెక్కడ చేరితే వాడూ అక్కడేనని కాస్త నిరుత్సాహంగానే చెప్పారాయన," అందామె.

షాక్ తిన్నాను. సావిత్రికి గతమే తప్ప భవిష్యత్తు లేదు. ఆమె పోతే ఆమె భర్త ఏమైపోతాడా అని బెంగపెట్టుకున్నాం. మరి భవిష్యత్తులో ఐఐటి కోసం తన జీవితాన్నే ధారపోసిన సుదర్శన్ అది రాకపోతే ఇప్పుడేమై పోతాడు?

నేను చాలాసార్లు సుదర్శన్‌తో మాట్లాడాను. వాడికి జీవితంలో చాలా సరదాలున్నాయి. ఐఐటి సీటు సాధించి తండ్రి ఆశయం నెరవేర్చాక వాడు తెలుగు సాహిత్యం మీద దృష్టి సారిస్తాట్ట. జానపద గేయాలు నేర్చుకుంటాట్ట. వాటి గురించి మాట్లాడుతుంటే వాడి కళ్ళు మెరిసేవి. మరి ఇప్పుడా మెరుపేమౌతుందో!

రఘు నాతో, "నీకు చెప్పదు కానీ వాడికింకా బోలెడు సరదా లున్నాయి. వాటిలో చాలావరకు వాళ్ళ నాన్న కిష్టం లేనివే. అసలు వాడికైతే స్వతహాగా ఐఐటి మీద మోజు లేదు. ఐఐటిలో సీటు తెచ్చుకుంటే వాడి ఇష్టాలేమీ కాదనని మాటిచ్చాట్ట వాళ్ళ నాన్న. అందుకని ప్రాణం పెట్టి మరీ చదువుతున్నాడు," అన్నాడు. అటు తండ్రి ఆశా నెరవేరలేదు. ఇటు వాడి ఆశ నెరవేరే అవకాశమూ పోయింది. తట్టుకోగలడా సుదర్శన్?

ఐఐటి సీటు రాకపోతే జీవితానికి ధ్యేయం పోయినట్లు భావించే కుర్రాళ్ళు నాకు స్వయంగా తెలుసు. ఆత్మహత్యకు తలపడేవారూ ఉన్నారని విన్నాను. రోటిలో తలదూర్చినవారు రోకటిపోటుకు సిద్ధపడాలని వాళ్ళకు తెలియదు.

ఏది ఏమైనా ఇప్పుడు సుదర్శన్ని చూడ్డం కంటే నరసింహారావుని చూడ్డమే నయం. ఈ విషయంలో మా ఇద్దరిదీ ఏకాభిప్రాయం కావడంతో నిముషాల మీద గమ్యం చేరుకున్నాం.

అక్కడ చాలా జనం ఉన్నారు. వారిలో పరిచితులూ ఎక్కువే కానీ ఈరోజు వారి ముఖాల్లోని భావాలు కాస్త అపరిచితం అనిపించడంతో కాసేపు మౌనంగా నిలబడ్డాం ఇద్దరం. అంతలో నా భార్యకు కాస్త దూరంలో సావిత్రి చెల్లెలు పద్మ కనపడడంతో వెళ్ళి పలకరించి మాట కలిపింది. ఆ మాటలు వినడానికి నేనూ కాస్త దగ్గరగా వెళ్ళాను.

దు:ఖిస్తూనే పద్మ చాలా విశేషాలు చెప్పింది. సావిత్రి ఆరోగ్యం దిగజారిందని వారంరోజుల క్రితమే కొడుకూ, కూతురూ వచ్చి చూశారు. ఇంకా కొన్నాళ్ళదాకా ఫరవాలేదని వెనక్కు వెళ్ళిపోదామనుకుంటుండగా ఉన్నట్టుండి ఆమె ప్రాణం పోయింది.

"మీ అక్కది గొప్పదృష్టం. సమయానికి అంతా దగ్గరున్నారు," అంటూ నా భార్య స్టాకు డైలాగు వాడింది.

పద్మ వెంటనే, "అవునండీ, మా అక్కది నిజంగా అదృష్టమే! లేకుంటే మా బావలాంటి భర్త దొరకడు. ఇంత చాకిరీ చేయాల్సి వచ్చినా దాని ఎదురుగా కానీ, వెనకగానీ ఒక్కరోజు కూడా విసుక్కోలేదు. ఇంకా చెప్పాలంటే అక్కకే చిరాకు. చిన్నప్పట్నించీ అది మమ్మల్నీ, అమ్మానాన్నల్నీ తెగ విసుక్కునేది. పెళ్ళయ్యాక ఆ విసుగు భర్త మీదకు మళ్ళింది. మహాను భావుడు ఎప్పుడూ దాన్ని పల్లెత్తు మాట అనలేదు. కాన్సరొచ్చాక దాని చిరాకు ఎంత పెరిగిందంటే సాయానికి రావాలంటే మేమే కాదు, కన్న కూతురే భయపడేది. బావ మహా ఓర్పుగా దాన్ని కంటికి రెప్పలా చూసుకున్నాడు," అంది.

నా ఆలోచనలు వేరే పోతున్నాయి.

సాధారణంగా ఇలాంటిచోట్ల పోయినవారి గురించిన ప్రశంసలు వింటాం. కానీ పద్మ బ్రతికున్న బావను పొగుడుతూ ఆ సందర్భంలో అక్కను కాస్త చిన్నబుచ్చుతోందంటే అందుక్కారణం అపురూపమైన నరసింహారావు వ్యక్తిత్వం. అతడి ఓర్పునామె మెచ్చుకుంటోంది కానీ అది ఓర్పు కాదనీ చరిత్ర గుర్తుంచుకోదగ్గ ప్రేమ అనీ నాకు అనిపించింది.

వాతావరణం నిండా విషాదం. మధ్యమధ్య ఏడుపులు. కొందరు సావిత్రి కళ్ళు చారడేసి అంటున్నా, ఎక్కువమంది నరసింహారావు కళ్ళే చారడేసి అంటున్నారు. ఎవర్ని పలకరిద్దామన్నా ప్రపంచంలోని విషాద మంతా తమదేనన్నట్లు ముఖాలు పెడుతున్నారు. నాలో స్పందన తక్కువో, లేక నటించడం నాకు చేతకాదో కానీ నేను చాలా మామూలుగా ఉన్నాను. ఒక జీవికి నరకయాతన నుంచి విముక్తి కలిగితే అది సంతోషించాల్సిన విషయంగా ఒప్పుకునే నిజాయితీని మన సంప్రదాయం హర్షించదు కాబట్టి నా ముఖంతో నేను నరసింహారావును కలిసి పలకరించడానికి తటపటా యిస్తున్నాను.

అంతలో అలా వచ్చాడు రంగారావు. నన్ను చూసి, "ఆయన్ను పలకరించారా?" అనడిగాడు. నేను తల అడ్డంగా ఊపగానే, "అయ్యో, బాడీ కదిలేలోగా ఓసారి పలకరించండి," అంటూ నన్ను జవాబివ్వనివ్వ కుండా నరసింహారావు దగ్గరకు లాక్కెళ్ళాడాయన.

మృతదేహాన్ని తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. నరసింహారావు కొడుకు భోరున ఏడుస్తున్నాడు. అతడి భుజాలు నిమురుతున్నారు దగ్గరి బంధువులు. పక్కనే నిలబడి చూస్తున్నాడు నరసింహారావు శూన్యంలోకి.

ఆ దృశ్యం చూడగానే నాకు అప్రయత్నంగా ఏడుపొచ్చేసింది. కళ్ళు తుడుచుకున్నాను. బాగుండదని వెక్కడాన్ని అదుపు చేసుకున్నాను. తమాయించుకుందుకు కొన్ని నిముషాలు పట్టింది.

"అమ్మ లేకపోవడం నీకూ పెద్దలోటే అయినా ఇప్పుడు నీకంటూ నీ జీవితముంది. కానీ మీ నాన్న సంగతి చూడు. భార్యే జీవితం అనుకునే వయసులో పోయిందావిడ. నువ్వు ఆయన్ను చూసుకోవాలి," అంటున్నా డొకాయన.

అందుకు నరసింహారావు స్పందిస్తూ, "ఒంటరిపక్షిని. కాలం వెళ్ళ బుచ్చడానికి నన్ను ఇంకెవరో చూసుకోవాలా?" అన్నాడు.

ఉలిక్కిపడ్డాను. ఆ గొంతులో గాద్గద్యం లేదు. మరోసారి కళ్ళు తుడుచుకుని ఆయనవైపు చూస్తే ఆ కళ్ళలో తడి లేదు. అక్కడ వేరెవ్వరి లోనూ కనిపించని ఓ కొత్త అనుభూతి ఆయన ముఖంలో గోచరించింది నాకు. అదే ఆయనతో నా పలకరింపును చూపులకు పరిమితం చేసింది.

ఏమిటా అనుభూతి? నిత్యజీవిత సత్యమా, వేదాంతమా, సందేశమా, అనుభవమా?

నాకది అప్పుడు అందలేదు.

అక్కడి తంతు పూర్తయ్యాక నేనూ, నా భార్య అక్కణ్ణించి కదిలాం. అలాంటి చోట్నించి వెళ్ళేటప్పుడు వెళ్ళొస్తామనకూడదట. అసలు వెడుతున్న సంగతే చెప్పకుండా చల్లగా జారుకోవాలిట.

దారిలో, "వెంకట్రావు ఇంటికి వెడదామా?" అన్నాను.

"అయ్యో, ఇక్కణ్ణించి తిన్నగా ఇంటికే వెళ్ళాలి," అంటూ సంప్ర దాయం చెప్పింది నా భార్య. ఇల్లు చేరాక నాకిక సుదర్శన్ని పలకరించే మూడ్ పోయింది. ఒకేరోజున రెండు పరామర్శలెందుకులే అనిపించింది మరి.

అయితే మరి కాసేపటికే సుదర్శన్ తనే మా ఇంటికి వచ్చాడు.

నేను సూటిగా వాడి ముఖంలోకి చూడలేక తలవంచుకునే, "విషయం తెలిసింది. ఏం చేద్దామనుకుంటున్నావు?" అనడిగాను.

"ఇక నేను ఐఐటి ఎంట్రెన్సు పరీక్షలు రాయక్కర్లేదు అంకుల్," అన్నాడు సుదర్శన్.

అది నిరాశతో అన్న మాట అని నేనూహించగలను. అందుకే, "ఏం చేయవని కాదు. ఏం చేస్తావని అడుగుతున్నాను," అన్నాను జాలిని ఆప్యా యతగా మార్చే ప్రయత్నం చేస్తూ.

"సామర్థ్యమున్న మనిషి తన కృషి వృథా కావడాన్ని భరించలేడు. అందుకే ఖచ్చితంగా సాధించగలనని నమ్మకమున్న వాటికోసమే ప్రయ త్నించడం నాకిష్టం. ఇక మీదట అదే చేస్తాను," అన్నాడు సుదర్శన్.

ఉలిక్కిపడ్డాను. ఆ గొంతులో విషాదం, నీరసం లేవు - సరికదా ఉత్సాహం ధ్వనిస్తోంది. తలెత్తి చూస్తే తండ్రి ఆశయం నుంచి విముక్తి లభించినందుకు రిలీఫ్, తన ఆశయం కోసం కృషి చేయబోతున్నందుకు ఉత్సాహం కలగలిసిన ఓ వింత అనుభూతి అతడి ముఖంలో కనపడింది నాకు.

అప్పుడు నాకు స్ఫురించింది - కాసేపటి క్రితం నరసింహారావు ముఖంలో నేను గుర్తించిన అనుభూతి అదే!